తూర్పుగోదావరి, కాకినాడ

డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




# భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



**శంఖవరం , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**

నవరాత్రులు పూజలు అందుకున్న వినాయకుని ప్రతిమలు నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. శంకవరం మండలంలోని కత్తిపూడి లో వేంచేసి ఉన్న వరసిద్ధి వినాయక ఆలయంలో చవితి రోజున ప్రతిష్ట పూజలు సత్యనారాయణ శర్మ త్రినాథ్ శర్మలు పూజలు నిర్వహించారు. సుందరంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వాహనాలపై స్వామివారి ప్రతిభ నుంచి మేళ తాళాలు కోలాట బృందాల నృత్యాలు సుబ్రమణ్యేశ్వర భజన సమాజంతో భజన కార్యక్రమం నిర్వహిస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు గావించారు తొమ్మిది రోజులు పాటు నవరాత్రులను అంగరంగ వైభవంగా నిర్వహించారు పూజల అనంతరం శనివారం కమిటీ సభ్యులచే పూజ అనంతరం ఊరేగింపు ప్రారంభించారు అనంతరం గ్రామ శివారుని గల పోలవరం కాలవలో నిమజ్జనం గావించారు కార్యక్రమంలో జీలకర్ర త్రిమూర్తులు కంద అప్పారావు జిలకర లక్ష్మణరావు జిలకర బుజ్జి తోట మణికంఠ కంద సతీష్ ఓరుగంటి శివ జిలకర చంద్ర రావు గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వినాయకుడి లడ్డు 10000 సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయావరణలో గల వరసిద్ధి వినాయక ఆలయంలో నవరాత్రులపాటు పూజలు అందుకున్న 25 కేజీల లడ్డు వేలంపాటలో పదివేల రూపాయలకు దక్కించుకున్నారు తుని మండలం సురవరం గ్రామానికి చెందిన ఉగ్గిన రుద్రాన్ ఈలడ్డును దక్కించుకున్నారు గ్రామానికి చెందిన పాఠంశెట్టి వెంకట్ లడ్డూని స్వామివారికి బహుకరించారు

# ఘనంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవ వేడుకలు



**కాకినాడ రూరల్ , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ ఇండియా 120వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను కాకినాడ సూర్యారావుపేట బ్రాంచ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ కె.వాసుదేవరావు మాట్లాడుతూ 1906 సెప్టెంబర్ 7న ముంబైలో స్థాపించబడిన బ్యాంకు ఆఫ్ ఇండియా, 120 సంవత్సరాలుగా దేశ ఆర్థికాభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో అంకితభావంతో కృషి చేసిందని తెలిపారు. 120 ఏళ్ల క్రితం కొంతమంది వ్యాపారవేత్తలచే స్థాపించబడిన బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రారంభంలో కేవలం ముంబైలోని వ్యాపార వర్గాలకు సేవలు అందించి,ఆ తర్వాత క్రమంగా భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించి, స్వదేశంలోనే కాకుండా, విదేశాల్లో కూడా తన శాఖలను స్థాపించి అంతర్జాతీయంగా బ్యాంకింగ్ సేవలను అందించడంలో ముందంజలో ఉందన్నారు. 120 ఏళ్లుగా బ్యాంక్ ఆఫ్ ఇండియాపై విశ్వాసం ఉంచిన తమ బ్యాంక్ వినియోగదారులు, ఉద్యోగులు, వాటాదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మమత, డి బి వి స్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

# మండల, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీతలకు సన్మానం

**అంబాజీపేట , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల,జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అవార్డు గ్రహీతలను స్థానిక మండల వనరుల కేంద్రంలో శనివారం ఘనంగా సత్కరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎ.ఎల్. వర ప్రసాద్,కె. గణేష్ నరసింహారావు, సిహెచ్ శ్యామల కుమారి, మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎస్.శ్రీనివాస్,కె. భూలక్ష్మి, బి.శ్రీదేవి, కె.నాగ శ్రీదేవి ,ఎ.మంగతాయారు,పి. రాజేశ్వరిలను సన్మానించారు. ఎంఈఓలు కె. వెంకటేశ్వర రావు,ఎం. ప్రకాష్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మాచవరం సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, ఏఎంసి వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ,అంబాజీపేట సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, నాయకులు నాగాబత్తుల సుబ్బారావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,సిఆర్ఎంటిఎస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజకీయ సవాళ్ల నేపథ్యంలో మురళీ రాజు గృహనిర్బంధం



**ప్రత్తిపాడు , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**

ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణం రాజును శనివారం ఉదయం ధర్మవరం గ్రామంలో ఆయన నివాసంలో పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. వివరాల్లోకి వెళితే మురళీకృష్ణంరాజు తండ్రి రామరాజు పై కూటమినేత లు ఒక మహిళను అడ్డుపెట్టుకుని అక్రమ కేసు పెట్టారని, ప్రత్తిపాడు నియోజకవర్గంలో నేతలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, నా రాజకీయ జీవితంలో నేను ఎటువంటి అవినీతి చేయలేదని, మీరు అవినీతికి పాల్పడడం లేదని ప్రమాణం చేయగ లరా, అవినీతి చేయలేదని రాచపల్లి అరుణా చలేశ్వర స్వామి దేవస్థానంలో ప్రమాణం చేస్తారా, నేను శనివారం ఉదయం ఆలయంలో ప్రమాణం చేస్తానని శుక్రవారం జరిగిన.. నిన్న.. విలేకరుల సమావేశంలో ముదునూరి ప్రకటించడం జరిగింది.

మాట ప్రకారం ముదునూరి శనివారం తన కార్యకర్తలతో ఆలయానికి బయలుదేరే సమయానికి ప్రత్తిపాడు పోలీసులు ముదునూరి ఇంటికి చేరుకుని ఆయనను గృహనిర్బంధం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇరు పార్టీ నేతలు రాజకీయ సవాళ్లు నైపద్యంలో కక్షలు పెరగకుండా, ఘర్షణలుజరగకుండా ముందు జాగ్రత్తగా నేతలను గృహనిర్బంధం చేశామని పోలీసులు తెలిపారు

# పుణ్యక్షేత్రం గ్రామం లో జరిగిన అన్నదానంలో పాల్గొన్న బత్తుల

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**



రాజానగరం మండలం, పుణ్యక్షేత్రం గ్రామంలో శనివారం జరిగిన మహా అన్నదాన కార్యక్రమానికి కమిటీవారి ప్రత్యేక ఆహ్వానం మేరకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా గణేశునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెంకటలక్ష్మి తానే స్వయంగా భక్తులకు వడ్డించారు. అనంతరం భక్తకోటితో కలసి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈకార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# సాంస్కృతిక కార్యక్రమాలతో గణేష్ నిమజ్జనం

**ఆత్రేయపురం , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**

మండలంలోని 17 గ్రామాల్లో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు తొమ్మిది రోజులు పూజించి ఆత్రేయపురం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి, ఉచ్చిలి లక్ష్మీ గణపతి స్వామి వారు,గణపతిని శనివారం వివిధ సంస్కృతిక కార్యక్రమాలు బాణాసంచా కాల్పులతో.సన్నాయి వాయిద్యాలు, అంగరంగ వైభవంగా . గౌతమి,వశిష్ఠ, గోదావరి ,కాలవల్లో గణపతి విగ్రహాలను యువత గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు. భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు .

# జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు

**- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్**



**కోనసీమ బ్యూరో , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతా రామన్ ప్రవేశపెట్టిన జీఎస్టీ తగ్గింపు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు అనేక రకాలుగా ఉపశమనం కలిగిస్తుందని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి నల్లా పవన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం అమలాపురం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ 2000 వ సంవత్సరంలో అప్పటి ప్రధాని వాజ్పేయి జిఎస్టి అమల్లోకి తీసుకు వద్దామని అనేక రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కమిటీలు వేసి ఎట్టకేలకు 2017జూలై 1 నుంచి ప్రధాని నరేంద్ర మోడీ జీఎస్టీని అమల్లోకి తీసుకొచ్చారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత దేశాన్ని ఏకీకృత భారత దేశంగా చేయాలని ఎన్నో కళలుగన్నారని అందులో ఇది కూడా వర్తిస్తుందని అన్నారు. కేంద్ర మంత్రి నిర్మల సీతా రామన్ ఈనెల 22 నుంచి అమలు అయ్యేలా వినూత్నంగా ఎక్కువ మొత్తంలో జీఎస్టీ తగ్గించేలా తగ్గింపు చేశారన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు పొందాలంటే చదువుకోవాలని ఉద్దేశంతో వారి చదువుకి ఉపయోగపడే బుక్స్, పెన్స్, పెన్సిల్స్, రబ్బర్లు లాంటి స్టేషనరీ మీద జీరో పర్సెంట్ జీఎస్టీ చేశారన్నారు. ప్రతి వ్యక్తి ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయడం జరుగుతుందని, వాటి కొనుగోలుపై ప్రతి వాహనంపై 10,000 నుంచి 13,000 వరకు తగ్గించడం జరుగు తుందని, మహిళలు ఇంట్లో వాడే గృహోపకరణాలు అనగా ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్ లు, మిక్సీలు, గ్రైండర్ ల మీద భారీగా తగ్గించడం జరిగిందని, అలాగే ఆరోగ్యానికి సంబంధించిన క్యాన్సర్ లాంటి కొన్ని రకాల ప్రాణాంతకమైన జబ్బులకు వాడే మందులు మీద జీరో పర్సెంట్ ట్యాక్స్ తగ్గించడం జరిగిందని, కొన్ని మందుల మీద 12 శాతం నుంచి 5 శాతానికి పన్ను తగ్గించడం జరిగిం దన్నారు. ఆరోగ్య భీమాకు సంబంధించిన పన్నులు కూడా జీరో కి చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ పనిముట్లు మీద 18 నుంచి 5 శాతానికి పన్ను తగ్గిం చడం జరిగింది, పాలు, పన్నీరు మీద జీరో పర్సన్ టాక్స్ చేయడం జరిగింది అన్నారు. అలాగే ప్రతీ దాని మీద టాక్స్ తగ్గించి ఆత్మ నిర్భర భారత్ అనే దానిని తీసుకుని భారత్లో తయారైన వస్తువులే మన దేశం వాళ్లే కొనాలనే ఉద్దేశంతోనే తీసుకు రావడం జరిగిందని అన్నారు. ఇవన్నీ కూడా కేవలం ప్రకటన వరకే మాత్రమే పరిమితం కాదని సెప్టెంబర్ 22వ తారీకు నుంచి అమల్లోకి వస్తున్నాయని నిర్మల సీతారామన్ స్పష్టం చేశారని అన్నారు. సందర్భంగా నిర్మల సీతారామన్ కి, ప్రధాని నరేంద్ర మోడీకి ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ తరఫునుంచి ధన్యవాదాలు తెలియ జేస్తున్నామన్నారు. పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షులు అయ్యల భాషా, వెంకట్, రాజు పాల్గొన్నారు.

# జాయింట్ కలెక్టర్ చొరవతో ఇంటికి చేరిన నాగేశ్వరావు కుటుంబం



**అమలాపురం ( కోనసీమ బ్యూరో ) , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**

అమలాపురం కు చెందిన శారీరక వైకల్యం గల నాగేశ్వరరావు అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని మోసపూరితంగా నమ్మించిన శంకర్రావు అనే వ్యక్తి చేతిలో బలయ్యాడు. ఉద్యోగం అవకాశమంటూ చెన్నైకు తీసుకెళ్లిన అతను, నాగేశ్వరరావు దగ్గర ఉన్న డబ్బులను తీసుకొని చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో అతని భార్య, చిన్న పిల్లలతో వదిలేసి పరారయ్యాడు. ఈ మోసానికి గురైన నాగేశ్వరరావు, తన పరిస్థితిని జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి కి ఫోన్ ద్వారా వివరించాడు. భార్య, పిల్లలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపాడు.

ఈ విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ మానవతా దృష్టితో స్పందించి, తక్షణమే చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ ఆర్‌పీఎఫ్ సిబ్బందితో సమన్వయం చేసి నాగేశ్వరరావు కుటుంబానికి రైలు టిక్కెట్లు, ప్రయాణ సౌకర్యాలను ఏర్పాటు చేయించారు.

అంతేగాక, అవసరమైన ఖర్చుల కోసం తన సొంత డబ్బును పంపించి ఆ కుటుంబానికి మానవతా హస్తం అందించారు.

# త్వరలో కాకినాడ జిల్లాకు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ రాక

**రౌతులపూడి , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**



అతి త్వరలో కాకినాడజిల్లాకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ విచేయుచున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కాకినాడ జిల్లా ఇంచార్జ్ పసుపులేటి చిన్నబాబు మాదిగ అన్నారు. శనివారం రౌతులపూడిలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తెలా అబ్రహం మాదిగ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన వెల్లడించారు.అయన రాకను విజయవంతం చేసే విధంగా ఇప్పటి వరకు వేసిన ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి మరియు అనుబంధ సంఘాల కమిటీలు,ఇకముందు వెయ్యబోయే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి కమిటీల నాయకులు అనుబంధ సంఘ నాయకులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రౌతులపూడి మండలం లో ఎంఎస్పి నూతన కమిటీలు ఏర్పాటు చేశారు. మండలం అధ్యక్షుడిగా దూలపల్లి నూకరాజు మాదిగ,కాకినాడ జిల్లా కో ఇన్చార్జి అనంతపు రాజు మాదిగ,జిల్లా కో ఇన్చార్జి దేవరపు సురేష్ మాదిగ, జగ్గంపేట నియోజవర్గ కో ఇంచార్జ్ మండే డేవిడ్ రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్, రౌతులపూడి మండలం నాయకులు జి.రాజేష్ మాదిగ , ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పి నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ కషాయాలను సొంతంగా తయారు చేసుకోవచ్చు : డిపిఎం శ్రీనివాస్



**అంబాజీపేట , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**

ప్రకృతి వ్యవసాయ కషాయాలను రైతులు స్వంతంగా తయారు చేసుకోవచ్చునని డిపిఎం శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఇరుసుమండలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆగ్నస్త్రంను డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ సాగులో చీడ పీడల నివారణకు డ్రోన్ సహాయాన్ని ఉపయోగించడం వల్ల సమయంతోపాటు ఖర్చు ఆదా అవుతుందన్నారు.

ఆగ్నస్త్రంను డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల రెక్కల పురుగు కాండం, తొలుచు పురుగును నివారించ వచ్చునన్నారు. అందుకు గాను రైతులకు ఎం.టి నాగవేణి, దుర్గాలక్ష్మిలు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ తేజ, సీఆర్పీలు కె.మల్లేశ్వరి, ఎం.సరితాశ్రీలక్ష్మి. ఎస్. భవాణి, పి.విజయ కుమారి, జె. కనకలక్ష్మి, రైతులు డి.వి.సత్య నారాయణరాజు, క్రాప నాగేశ్వరరావు, క్రాప పెద సత్యనారాయణ, కోనసల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

# యువ గణపతి స్వామిని దర్శించుకున్న ఎంపీ హరీష్ మాధూర్

**అంబాజీపేట , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**



గణపతి నవరాత్రుల మహోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో అన్న సమారాధనలు, గణేష్ విగ్రహ నిమజ్జనాలు, లడ్డూ వేలం పాటలు శనివారం జరిగాయి. మాచవరం పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న శ్రీ యువ గణపతి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ యువ గణపతి స్వామివారిని అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్ దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎంపీ హరీష్ మాధుర్ ను ఘనంగా సత్కరించారు.అలాగే స్వామివారి లడ్డూను వేలం నిర్వహించగా చొల్లంగి మధు సంజీవ్ రూ.73,100లకు దక్కించుకున్నారు.అనంతరం యువ గణపతి స్వామివారిని పురవీధుల్లో వైభవంగా ఊరేగించి, స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు,చిన్నారులచే నిర్వహించిన కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే మాచవరంలో లక్ష్మీ గణపతి స్వామివారిని ఎంపీ హరీష్ మాధుర్ దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించి లడ్డును వేలం వేశారు. గ్రామానికి చెందిన మానికిరెడ్డి పేరయ్య నాయుడు రూ.22, 500లకు దక్కించుకున్నారు. కొర్లపాటివారి పాలెం గంధం వారి వీధి, బందారు వారి వీధి, గంగలకుర్రు అరిగెలవారిపాలెంలలో గణపతి నవరాత్రుల ముగింపు మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అత్తిలి పెద పుల్లయ్య, దాసరి వాసు, దాసరి చిన్న, మట్టా నాగేంద్ర, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు ,సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మాచవరం సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు మైపాల తాతాజీ, సుంకర బాలాజీ, నాగా బత్తుల సుబ్బారావు, దొమ్మేటి రామారావు, జోగి కృష్ణ చైతన్య, కొప్పినీడి ఈశ్వరరావు ,వంగా చిన్నా, అరిగెల నానిలు పాల్గొన్నారు.

## వైనతేయ గోదావరి నదిలో ఘనంగా నిమజ్జనాలు



**మామిడికుదురు , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**
వినాయక చవితి సందర్బంగా పూజలందుకున్న గణపతి విగ్రహాల నిమజ్జనం శనివారం ఘనంగా జరిగింది.పది రోజుల పాటు పూజలు చేసిన భక్తులు విగ్రహాలను ఊరేగింపుగా వైనతేయ గోదావరి నదికి తీసుకు వెళ్లి భక్తి శ్రద్ధలతో గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.మామిడికుదురు తోపాటు పలు గ్రామాలలోని విగ్రహాలను నదిలో కలిపి గణపతి నవరాత్ర ఉత్సవాలకు ముగింపు పలికారు.పాశర్లపూడి బాడవలో గోదావరి నది వద్ద ఏర్పాటు చేసిన క్రైన్ సహాయంతో విగ్రహాల నిమజ్జనం వైభవంగా జరిగింది.ఎక్కడ ఎటువంటి ఆవాంచనీయ సంఘటనలు జరుగకుండా నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.మామిడికుదురు చివారు గాలిదేవరపాలెం వినాయకుని చేతిలో ఉన్న ఏడు కిలోల లడ్డూను అదే గ్రామానికి చెందిన నార్ని సత్య నారాయణ రూ.66 వేలకు పాడుకున్నారు.

## కిడ్నీ బాధితునికి రూ. 1,61,162లు ఆర్థిక సాయం అందించిన సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు..అభినందించిన జిల్లా కలెక్టర్

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**
పెదపూడి మండలం, సంపర గ్రామానికి చెందిన చల్లపల్లి నాగేశ్వరరావు హైదరాబాదు వలస వెళ్లి అపార్ట్మెంట్ వాచ్ మేన్ గా పని చేసుకుం టున్నా డు. అతని కుమారుడు చల్లపల్లి సతీష్ 20 సంవత్స రాల వయసులోనే రెండు కిడ్నీలు పాడై వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించు కుంటూ ఆర్థికంగా సతమతపడు తున్నాడు. ఈ నేపథ్యంలో చల్లపల్లి నాగేశ్వరరావు తన కుమారుడు చల్లపల్లి సతీష్ దయనియ పరిస్థితిని తెలుసుక్న సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు అతని వైద్యం నిమిత్తం రూ. 1,61,162లు సేకరించారు. ఈ సోమ్ము ను శని వారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతులు మీదుగా చల్లపల్లి సతీష్ తండ్రి చల్లపల్లి నాగేశ్వరరావుకు అందజేశారు. కిడ్నీ బాధితునికి ఆర్థిక సహాయం అందించిన సంపర ఎంప్లాయిస్ అసోసియే షన్ సభ్యులు దాతృత్వానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేకంగా అభినందించారు. సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో చేపట్టిన



స్వచ్ఛంద, సామాజిక కార్యక్రమాలను పరిశీలించి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సతీష్ కు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ రూ.10వేల నగదును అందజేసి కిడ్నీ సమస్యతో బాధపడుతున్న సతీష్ ఆరోగ్యం తొందరగా కుదుటపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంపర ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫౌండర్, చైర్మన్, ఉపాధ్యాయులు వడ్డి వెంకటేశ్వర్లు, సభ్యుడు మల్లిపూడి శివప్రసాద్, వాడపర్తి తాతీలు, కుందూరి వెంకట సుబ్బారావు కొమ్మన శ్రీనివాసరావు, యానాల మౌళి తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమ తిరుమలకు భారీ భక్తజనం

**- సామాన్య భక్తులకు సైతం స్వామి దర్శనం పై సంతృప్తి**
**- స్వామివారి ఆదాయం రూ.65.44 లక్షలు**

**ఆత్రేయపురం , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**
ఏడువారాల వెంకన్నగా నిత్య పూజలందు కుంటున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంక టేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది.వివిధ రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని తరిం చారు.ఆలయ పరిసరాలు గోవింద నామ స్మరణతో మారుమ్రోగింది. తెల్లవారు జామున సుప్రభాత సేవతో ప్రారంభమైన శ్రీవారి దర్శన, పూజా కార్యక్రమాలు.. రాత్రి 10 గంటల వరకు కొనసా గాయి. వచ్చిన భక్తులకోసం డిప్యూటీ కమీషనర్, ఈఓ నల్లం సూర్య చక్రదరరావు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉచిత పులిహోర



వితరణ, త్రాగునీరు, చంటి పిల్లలకు పాలు, బిస్కెట్స్, చంటిపిల్లల తల్లులకు, వృద్దులకు ఉచిత దర్శనం తదితర ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వారబంధాలు వెడల్పు చేయడంతో వచ్చిన భక్తులు ఉచిత దర్శనం, రూ, 50,200,1116 లద్వారా దర్శనాలు చేసుకొనే భక్తులకు చాలా తక్కువ సమయం లో దర్శనం కావడ ంతో వారి సంతృప్తి ని వ్యక్తం చేసారని తెలిపారు. అలాగే ఈరోజు స్వామివార్ని సుమారు ఏనభై,నుండి తొంబై వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని స్వామివారికి రూ,65.44 లక్షలు ఆదాయం సమాకూరిందని తెలిపారు.

భక్తులు సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుండి ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఆలయానికి నడిపినట్లు డీసీ చక్రధరరావు వెల్లడించారు. వచ్చిన భక్తులలో దాదాపు 35 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. వివిధ జిల్లాల నుంచి ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపారు. సాయంత్రం జరిగిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి.సూపెరడెంట్ పులపర్తి రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, టెంపుల్ ఇన్స్పెక్టర్ వై, శ్రీనివాస్, నారాయణ, నందిశ్వరుడు, వర్మ, దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు.





## జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులతో సమావేశం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త )**
శనివారం తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి ఆదేశాల ప్రకారం, తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ, బాల నేరస్థుల కేసుల విషయంలో మెరుగైన సేవలు అందించడానికి కావలసిన సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఇంచార్జ్ 3వ అదనపు మెజిస్ట్రేట్ పి.వి. రాఘవేంద్ర రావు, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఏ.వి. సుబ్బ రాజు, డిస్ట్రిక్ట్ ఎస్.టి. వెల్ఫేర్ ఆఫీసర్ ఎం. నాగ శిరీష, డిస్ట్రిక్ట్ బి.సి. వెల్ఫేర్ ఆఫీసర్ బి. శశాంక, జిల్లా విద్యాశాఖాధికారి కె. వాసుదేవ రావు, వైద్య ఆరోగ్య శాఖ ప్రతినిధి పి. కోమలి, సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ పి. సూర్య ప్రభావతి, జేజేబి ప్యానెల్ లాయర్స్, జేజేబి మెంబర్స్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జబీన తది తరులు పాల్గొన్నారు.

## ఒమ్మంగి గ్రామంలో ఘనంగా బలరాం జయంతి వేడుకలు



**ప్రత్తిపాడు , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త )**
మండలంలో ఒమ్మంగి గ్రామంలో బలరాం జయంతి పక్షోత్సవాలలో భాగంగా ఈ శనివారం బలరాముని చిత్రపటానికి పూజలు నిర్వహించారు .ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా, జిల్లా కోశాధికారి కంపరపు నాగేశ్వరరావు పాల్గొని బలరాముని జయంతి విశిష్టత గురించి వివరించారు.

ఈకార్యక్రమంలో భాగంగా భరతీయ కిసాన్ సంఘ్ ప్రత్తిపాడు మండల మండలం కన్వీనర్ గా సూరవరపు రమేష్ ను ప్రకటించారు .ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పెదిరెడ్ల గంగారావు,కొప్పన కోటేశ్వరరావు, వెంకట రమణ,రామిశెట్టి చంద్రబాబు తోలేటి రామారావు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా షోడశ రాత్రి పితృదేవతా పూజ

## - ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే పెద్దల పండగ



**కోనసీమ బ్యూరో , సెప్టెంబర్ 06 , ( ప్రభాతవార్త ) :**
శ్రీ గౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షోడశ రాత్రి పితృదేవతా పూజా మహోత్స వాలు అమలాపురం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ఎదురుగా 'చతుర్థశ్యాంతిః యమధర్మరాజ దివ్యజ్ఞాన పీఠం' వద్ద ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాలయం 'మహత్ అలం యాతి ఇతి మహాలయం' అని వ్యుత్పత్తి. అగణ్యమై న మహిమలకు నిలయం మహాలయం.లయం అంటే కలసిపోవటం, మహాలయం అంటే అనంతంలో కలసి పోవటం. పునర్జన్మ లేకపోవటం వలన వినాశనం కాని మరణాన్ని ఇచ్చేది అని అర్థం. భాద్రపదమాస పౌర్ణమి నుండి అమావాస్య వరకు గల పదహారు తిథులను మహాలయ పక్షము లేదా పితృపక్షమని వ్యవహరిస్తారు. పరమ పవిత్రమైన ఈ పదహారు తిథులలో ఊర్ధ్వలోకము నుండి అత్యంత శక్తివంతమైన కిరణములు తరంగాలు పృధ్విపై ప్రసరిస్తాయి. శ్రద్ధయా క్రియతే ధేయం శ్రాద్ధం అని శాస్త్రవచనం. శ్రద్ధయే శ్రాద్ధం. శ్రాద్ధకర్మలు ఆచరించేవారి శ్రద్ధను బట్టి కర్మకాండ లాభం జీవాత్మకు చేరుతుంది. దివంగత ఆత్మకు శాంతి సద్గతికి కలుగుతుంది.

దేవతాగణములైన పితృదేవతలు శ్రాద్ధకర్మలు ఆచరించేవారికి, వాటిని అందుకునే జీవులకు ఆ పుణ్యఫలాన్ని ఎప్పటికప్పుడు అందచేస్తారు. మహాలయం విశిష్టత ఊర్ధ్వలోకపు ద్వారాలు తెరిచి ఉండే సమయం మహాలయం. దేవతాగణములైన పితృ దేవతలు సృష్టి కార్యవృద్ధి కోసం జీవులను మరుజన్మలకు మరలించే మహిమాన్విత సమయం మహాలయం. జీవాత్మ పునర్జన్మ పొందాలన్న కాంక్షతో, తగిన గర్భం కోసం తమ శక్తులను ఏకీకృతం కావించి, కర్మాధికారం కలిగిన మానవుల వైపు చూసే సమయం మహాలయం. సత్కర్మలకు, శ్రాద్ధకర్మ విధులకు తక్షణం సత్ఫలితాలను ఇచ్చే సానుకూల సమయం మహాలయం. సర్వ కారుణ్య తర్పణ విధి పేరుతో సంతానం లేని గురువులకు, స్నేహితులకు, పెళ్లికాని అక్కాచెల్లెళ్ళుకు, అన్నదమ్ములకు, పెళ్ళయ్యి సంతానం లేని వారికి, మరణశిక్షలు, రోగాలు, ఆత్మ 'హత్య'లు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమా దాలు, యుద్ధాలలో అపమృత్యువుతో మరణించిన వారికి, మన బంధువులకు ఒక్కరనేమిటి గతించిన సమస్త మానవులకు, మరియు సమస్త ప్రాణులకు కూడా తిలోదకాలిచ్చే అత్యద్భుతమైన అవకాశం మహాలయ పక్షంలో మనకు ఇవ్వబడింది.

పితృదేవతలు సృష్టి నిర్మాణంలో భాగమై, జగత్కళ్యాణం కోసం ఈశ్వరునిచే నియమించబడి, ఊర్ధ్వలోకంలో ద్యులోకం ఉండే దేవతాగణములైన పితృదేవతలు ఏడు గణాలు. వైరాజులు, అగ్నిష్వాత్తులు, బర్హిషదులు వీరికి ఆకారం ఉండదు. హవిష్మంతులు, ఆజ్యపులు, సోమపులు, అంగిరసులు యజ్ఞయాగాది, హెూమాలలో వినిపించే కొన్ని పేర్లు అనే నాలుగు గణాలకు ఆకారం ఉంటుంది. వీరే పితృదేవతలు. జీవుల శారీరక, మానసిక నిర్మాణానికి కావలసిన వ్యవస్థను రూపొందిస్తూ, ప్రాణులందరిలో సామర్థ్యాన్ని, చైతన్యాన్ని కలిగిస్తుండే దివ్యశక్తులు. పితృదేవతలకు ప్రపంచంలోని ప్రజలంతా పుత్రులు, పౌత్రులు.పితృ అంటే కేవలం తల్లిదండ్రులు, తాతముత్తాతలే కాదు, పితృ శబ్దంలో అర్థం మన ఉనికికి మూలమైన ప్రతి ఒక్కరూ పితృలే. మన పూర్వీకులు, మన రక్త సంబంధీకులు, బంధువులే కాదు, ఆత్మసంబంధం ఉన్నవారు గతించిన సమస్త జీవరాశి కూడా మనకు పితృలే.

అమావాస్య భౌతిక పరిమితులను అధిగమించి, ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు ప్రయత్నిస్తూ, మోక్షాన్ని కోరుకునే సాధకులకు అత్యంత అనుకూలమైన, శక్తిమంతమైన తిథి అమావాస్య. సాధకుల మనస్సు అంతర్ముఖం కావటం, మనస్సు ఆత్మలో లయం కావటం, అతీంద్రియ జ్ఞానాన్ని పొందటం అమావాస్య తిథిలో ఎంతో సులభం. అసత్యం నుండి సత్యం వైపు ప్రయాణించేందుకు, మోక్షాన్ని సైతం పొందేందుకు సంవత్సరం మొత్తంలో అత్యంత అనుకూలమైన తిథి మహాలయ అమావాస్య. సమస్త ప్రాణులకు నిజమైన మేలు చేకూర్చే మహాలయ పక్షం పదహారు తిథులలో, మరణించిన వారి తిథులను అనుసరించి ఆయా తిథులలో లేదా మహాలయ అమావాస్యలో తిలతర్పణ, పిండప్రధాన శ్రాద్ధకర్మలు నిర్వహించటం అత్యంత శ్రేయస్కరం.శ్రాద్ధకర్మలు ఆచరించే వారికి, వాటిని అందుకునే జీవులకు మహాలయ పక్షం మోక్షమార్గం. మహాపర్వదినాలైన మహాలయపక్షాన్ని సంతోషకరమైన వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహికం జరుపుకోవాలి .శ్రాద్ధకర్మల వ్యవస్థ చనిపోయిన తరువాత శరీరానికి అంత్యేష్టి తప్ప ఏ ప్రక్రియలు అవసరంలేదు. అది అర్థం లేనిపని. అది శరీరానికి సంబంధించినదే ఐతే వారు బ్రతికి ఉండగానే నిర్వహించవచ్చు. భౌతిక శరీరం విడిచి మరణించిన జీవులు మళ్లీ జన్మించేంత వరకు సూక్ష్మ శరీరంతో పితృలోకంలో ఉంటారు. వారుండే లోకంలో అంతకుమించి పనిలేదు. మరణించిన వారికి సాధారణంగా శ్రార్ధకర్మలకు మించి సహాయం అవసరం లేదు. కుటుంబంలో ఎవరైనా వ్యక్తులు ఏ కారణంగా మరణించినా వారికి దశదిన సంస్కారాలు, శ్రాద్ధకర్మలు, సంవత్సరీకాలు, తద్దినాలు నిర్వహించాలి. ప్రతీనెలా అమావాస్య తిథిలో, ద్వాదశరాశుల సంక్రమణ సమయంలో, పన్నెండు నదులకు పుష్కరాల సమయంలో శ్రాద్ధకర్మలు నిర్వహించాలి. మనకు భౌతికంగా కనిపించే శరీరం మొదటిది. రెండోవది ప్రేత శరీరం లేదా సూక్ష్మ శరీరం. మూడోవది కారణ శరీరంలో జీవాత్మ. ఈ మూడింటికి ప్రతీకలు శ్రాద్ధకర్మల సంకల్పంలో చెప్పుకునే వసు, రుద్ర, ఆదిత్య రూపాలు. ఆయా రూపాల తో, ఆయా లోకాలలో కొంతకాలం నివశించే జీవులకు శ్రార్ధకర్మలతో ప్రీతి కలిగించే కాలం మహాలయం. ప్రతీ సంవత్సరం మరణించిన వారి తిథులలో మూడు తరాల తరాలవారిని తలచుకుని శ్రాద్ధకర్మలు నిర్వహించాలి. గతించిన జీవులు తమ పూర్వజన్మల కర్మానుభవం కోసం తిరిగి భూమిపై జన్మించి, ప్రశాంతంగా జీవించేందుకు కొన్ని మార్మిక ప్రక్రియలు నిర్వహించాలి. మానవులు శాస్త్రోక్తంగా నిర్వహించే కర్మకాండలు ఉన్నత లోకాలపై ఎంతో ప్రభావాన్ని చూపెడతాయి. కొన్ని తాంత్రిక ప్రక్రియల ద్వారా ఉద్భవించే తరంగాలతో ఇతర లోకాలలో ఉండే మృతాత్మల భాదలను తగ్గించవచ్చు. గతించిన జీవితాలు మంచివై, ఉత్తమమైన భవిష్య జన్మలకు దారితీసే సంతోషకరమైన ఆలోచనలు ప్రవేశపెట్టవచ్చు. సత్కర్మను ఆచరింప చేయవచ్చు.

దర్భలు, తిలలు, కాకులు. శ్రాద్ధకర్మాచరణలో శ్రద్ధ అత్యంత కీలకమైనది. శ్రాద్ధకర్మలో సంకల్పం, మంత్రం, తిలలు, పదార్థం, కాకులు ప్రధానమైనవి. పృధ్విపై మొట్టమొదటి సస్యపంట తిలలే. శ్రాద్ధకర్మ విధులలో వినియోగించిన పదార్థములను తిలలు రూపాంతరం చెందించగా, దర్భలు విద్యుత్తు వాహకాలుగా పనిచేసి పదార్థము ల సూక్ష్మసారాన్ని భూలోకం నుండి ఊర్ధ్వలోకాలకు తీసుకొనిపోతాయి. మరణించిన ఏ జీవుల కొరకు మానవులు శ్రాద్ధకర్మలు నిర్వహిస్తారో, వారు ఎక్కడ ఏ రూపంలో జన్మించినా, ఆ ప్రాణులకు ఏది ఆహారమో



ఆ ఆహారాన్ని అందించే వ్యవస్థను దేవతాగణములైన పితృదేవతలు నిర్వహిస్తారు. తిలతర్పణ, పిండప్రధాన, శ్రాద్ధకర్మలు సహేతుకమైన, అత్యంత పవిత్రమైన, పరమోత్కృష్టమైన వేద ప్రోక్తమైన కర్మకాండలు. గతించిన వారికోసం మహాలయ పితృపక్షంలో మనం చేసే శ్రాద్ధకర్మలు, సత్కర్మలు అనంతమైన పుణ్యఫలాన్ని ఇస్తాయి.

పెద్దల పేరుతో సత్కర్మాచరణ మన తల్లిదండ్రులు, తాతముత్తాతలు వారి జీవితాంతం ఎంతో కష్టపడి సంపాదించిన సంపాదన సత్కర్మలకు, దానధర్మాలకు ఖర్చు పెట్టకుండా, వారేమీ అనుభవించకుండా, సౌకర్యవంతంగా జీవించకుండా, తినోతినకో మనకు జన్మనిచ్చిన వారికో, మనకో వదలి వెళ్లటం సర్వసాధారణం. ఈ శరీరాన్ని ఇచ్చి, వారి సంపాదన మనకు ఇచ్చి, ఇతర లోకాల నుండి మరుజన్మలకు మరలిపోయే పుణ్యఫలం లేక ఎదురుచూస్తున్న మన పూర్వీకుల కోసం, వారు వదలి వెళ్లిన సంపాదనలో కొంతభాగాన్ని విద్యాలయాలు, వైద్యాలయాలు, దేవాలయాలను వారి పేరుతో నిర్మించాలి. శ్రాద్ధకర్మలతో పాటు వస్త్రదానం, అన్నదానం వంటి సత్కర్మలను ఆచరించాలి. మనకు జన్మనిచ్చిన వారు మనకు ఏ విధమైన ఆస్తులు ఇవ్వకపోయినా వారి ఋణం తీర్చుకొనేందుకు, వారు ఉత్తమ జన్మలకు మరలిపోయేందుకు మన సంపాదనలో కొంత భాగాన్ని అర్హత కలిగిన వారికి మన శక్తిమేరకు ఖర్చు చేయాలి. పితృదోషాలు జీవితంలో ఎదురయ్యే ప్రధానమైన సమస్యలకు కారణం పితృ, నాగ (సర్ప) దోషాలు. ఇవి అత్యంత ప్రమాద కరమైన, మానవ జీవితంపై దారుణమైన దుష్ప్రభావాన్ని చూపుతాయి. మానవులు చేసిన దుష్కర్మల ఫలితాలను ప్రారబ్ధ కర్మల రూపంలో అనుభవించాలి. ఎంత పెద్ద యంత్రమైనా చిన్న సాంకేతిక సమస్య తలెత్తితే చాలు ఆ యంత్రం పనిచేయనట్లే, కొన్ని దోషాల వలన జీవితంలో తీవ్రమైన ప్రతి బంధకాలు ఏర్పడతాయి. ఆస్థి తగాదాలు, దాయాదుల పోరు, వివాహాలు ఆలస్యం కావటం, దంపతుల మధ్య సఖ్యత లేకపోవటం, సంతానలేమి కారణంగా వారసత్వ వంశాభివృద్ధి లేక పోవటం, కోటానుకోట్ల ఆస్తులుండి ఏమీ అనుభవించలేకపోవటం, జీవితంలో ఉన్నతస్థాయిని అందుకోలేక అనాసక్తతగా జీవించటం పితృదోషంగా పరిగణిస్తారు

మిగిలిన భాగం ఎనిమిదవ పేజీలో....

